# సుందరీకరణ పనులు పూర్తి చేయాలి



బోయిన్‌చెరువు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నరసింహ యాదవ్

బాలానగర్ : ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట బోయిన్ చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ సోమవారం ఏఈ ఆశతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బోయిన్‌చెరువు సుందరీకరణ పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జాప్యం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయన్నారు. పరిసరప్రాంతాల వారికి సౌకర్య వంతంగా ఉండే విధంగా పనులు చేయాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, శ్రీనివాసరెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి ( కేపీహెచ్‌బీ కాలనీ ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ – రూపాయలు). టమాట 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 35, కాకర 45, బీర 40, క్యాబేజీ 13, ఫ్రెంచ్ బీన్స్ 105, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 23, దొండ 18, చిక్కుడు 65, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలు 25, కీర 23, దోస 18, సోర 12, పొట్లకాయ 23, కంద 65, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 18, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9 నుంచి 11, చామ 35, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 26, గుమ్మడి 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1) 5 నుంచి 6, పొప్పడి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

# పెండింగ్ పనులు పూర్తి చేస్తాం



ఎమ్మెల్యే కృష్ణారావుకు మ్యానిఫెస్టోను వివరిస్తున్న డా.ఎస్వీ ప్రసాద్, సొసైటీ సభ్యులు

అల్లాపూర్, మే 26 : మోతీనగర్‌లో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ నెల 28న మోతినగర్ కో– ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు జరగనున్నాయాయి.

ఈ నేపథ్యంలో డాక్టర్ ఎస్వీ ప్రసాద్ నేతృత్వంలో సొసైటీ సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి తమ మ్యానిఫెస్టో అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు బాగున్నాయని..

గతంలో సొసైటీలో కొందరు నిధులు దుర్వినియోగానికి పాల్పడిన అంశాన్ని తానే స్వయంగా డిప్యూటీ రిజిస్ట్రార్‌కు లేఖ రాసిన తర్వాతే వెలుగులోకి వచ్చిందని గుర్తు చేశారు. మోతీ నగర్ ప్రజలు విజ్ఞతతో కూడిన ఓటర్లను, మంచి ప్యానెల్‌ని ఎన్నుకుంటారని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

### కల్యాణ లక్ష్మి .. షాదీముబారక్ పేదలకు అండ

బాలానగర్ : కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేదలకు అండగా నిలిచాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని బాలానగర్ మండల కార్యాలయంలో తహసిల్దార్ శ్రీనివాస్, కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డిలతో కలిసి ఆయన 50 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఊరట లభిస్తుందన్నారు. ఆడబిడ్డ పెండ్లికి ప్రభుత్వం పెద్దన్న పాత్రను పోషిస్తూ అండగా నిలువడం అభినందనీయమన్నారు. ఆడబిడ్డలు కలిగిన తల్లిదండ్రులకు ఈ పథకాలు చేయూత అందిస్తున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగమణి, బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు నరసింహ యాదవ్, రవీందర్ రెడ్డి



కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తనయుడు శివఅభిషేక రావు, దివ్య వివాహ వేడుకలకు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు కురుమయ్యగారి నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

- కేపీహెచ్‌బీ కాలనీ

## తులం బంగారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలి



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్లు శ్రీనివాసరావు, సబియాబేగం

కేపీహెచ్‌బీ కాలనీ, మే 26 : కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబిహ బేగం ప్రశ్నించారు. సోమవారం కూకట్‌పల్లి మండల కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు కార్పొరేటర్లు శ్రీనివాసరావు, సబిహ బేగం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆడబిడ్డ పెండ్లికి మాజీ సీఎం కేసీఆర్ పెద్దన్నలా.. ఆదుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికసాయంతో పాటు తులం బంగారం ఇస్తామని మాయమాటలు చెప్పిందని, ఏడాదిన్నర గడిచినా.. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి.. ప్రజలే గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రవి కిరణ్ రెడ్డి



పీస్ కమిటీ మీటింగ్‌లో సభ్యులతో మాట్లాడుతున్న బాలానగర్ ఏసీపీ నరేశ్ రెడ్డి

అల్లాపూర్, మే 26 : బక్రీద్‌ను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీపీ, అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డితో కలిసి శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ నియమనిబంధనలు పాటించాలన్నారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. పటిష్టమైన బందోబస్తు ఉన్నదని, ప్రశాంతమైన వాతావారణంలో బక్రీద్‌ను నిర్వహించుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్‌్స శాఖలు సేవలు అందించాలని కోరారు.

బాలానగర్, మే 26 : బక్రీద్ శాంతియుత వాతావరణంలో జరుపుకోవడానికి అన్నివర్గాల వారు సహకరించాలని బాలానగర్ ఏసీపీ పి.నరేశ్‌రెడ్డి సూచించారు. సోమవారం బాలానగర్ పీఎస్‌లో సీఐ నరసింహారాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశానికి ఆయనతోపాటు సనత్‌నగర్, జీడిమెట్ల, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్లు ఆయా ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు. ఏసీపీమాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా బాలానగర్ డివిజన్ పరిధిలో అన్ని పోలీస్‌స్టేషన్ ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో బాలుడు మృతి

కుత్బుల్లాపూర్, మే 26 : విద్యుదాఘాతంతో తొమ్మిదేండ్ల బాలుడు మృతిచెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన చింతల అశోక్ కొడుకు పెండ్లి జరుగుతున్నది. తన ఇంటి ఎదుట వేసిన పెండ్లి పందిరికి ఉన్న ఇనుపరాడ్లకు విద్యుత్ వైర్ చుట్టి ఉన్నది. ఇంటిపక్కన ఉండే అరుష్ రాథోడ్ (9) ఈ నెల 25న రాత్రి తన స్నేహితులతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ఇనుప రాడ్డుకు తగలడంతో అక్కడే కుప్ప కూలిపోయాడు.

స్థానికులు సూరారం మల్లారెడ్డి దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుదాఘాతంతోనే చనిపోయినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## లార్వాదశలో దోమలను నియంత్రించాలి



దోమల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీ కాలనీ : లార్వాదశలోనే దోమలను నియంత్రించాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీలో ఎంటామాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను కార్పొరేటర్ ప్రారంభించారు. అపరిశుభ్రమైన పరిసరాలలో ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయని, ప్రజలందరూ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎంటామాలజిస్ట్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంటమాలజీ ఏఈ సోని, అసిస్టెంట్ మహేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ కాలనీ, మే 26 : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్ పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దశమ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం పూజలతో పాటు సూర్యప్రభ వాహన సేవ, ఉత్సవమూర్తులకు వసంతోత్సవం, గజవాహన సేవ, జరిగాయి. నేడు (మంగళవారం) శ్రీ స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నాపనం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి ఉంటాయన్నారు. వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



బాలానగర్ : బాలానగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేశ్‌రెడ్డికి బాలానగర్ మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్ర ఆచార్య శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం బాలానగర్ ఏసీపీ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ నసీర్, సలావుద్దీన్, లచ్చ గౌడ్ పాల్గొన్నారు.

## పెత్తనం చేస్తే సహించేదిలేదు

రవీంద్రభారతి : అసలైన ఐఎన్‌టీయూసీ మాదే నని, కార్మికవర్గ ప్రయోజనాలను విస్మరించి పెత్తనం చేస్తే సహించేదిలేదని ఐఎన్‌టీయూసీ (ఆర్) జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని విమర్శించిన కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్‌ప్రసాద్ ముఠాకు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్, దేశోద్ధారకభవన్‌లో సోమవారం జరిగిన (ఆర్) రాష్ట్ర మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. (ఆర్) రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ అయిలయ్య, జాతీయ కార్యదర్శి బి. అమర్‌బాబు, జాతీయ ఉపాధ్యక్షుడు స త్యదేవ్, మనోజ్‌భట్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ట్రేడ్ యూనియన్ నాయకుడు దయానంద్, రా ష్ట్ర నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

## మూడు నెలల రేషన్ జూన్ నెలలోనే..

అంబర్‌పేట : జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్‌ను జూన్ నెలలోనే ఇస్తున్నట్లు ఏఎస్‌ఓ దీప్తి తెలిపారు. మూడు నెలల్లో ఎవరి దరఖాస్తులైతే అప్రూవర్ అవుతాయో వారందరి పేర్లు మీసేవా పోర్టర్‌లో చూపించినా వారందరికీ సెప్టెంబర్ బియ్యం కోటా వస్తుందని చెప్పారు. ఎవరు కూడా ఆందోళన చెందవద్దని తెలిపారు. తమ ఇన్‌స్పెక్టర్లు ఫోన్ చేసి ఇంటికి వచ్చి విచారణ చేస్తారని ఫోన్‌లకు మెసేజ్‌లు వస్తాయని పేర్కొన్నారు.


# ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



కూకట్‌పల్లి జోన్‌ఆఫీస్ లో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న జడ్సీ అపూర్వ చౌహాన్, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 26: కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 21 ఫిర్యాదులు వచ్చినట్లు జడ్సీ అపూర్వచౌహాన్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 3, ఉద్యానవన విభాగానికి 1, ఎలక్ట్రికల్ విభాగానికి 1, పారిశుధ్య విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 6 ఫిర్యాదులు రాగా.. టౌన్ ప్లానింగ్‌కు 5, ఉద్యానవనం విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు ఉప కమిషనర్ వంశీకృష్ణ తెలిపారు. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు రాలేదని ఉప కమిషనర్ గంగాధర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులన్నిటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

### ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఉప కమిషనర్ మోహన్ రెడ్డి

మియాపూర్ : చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ నెలకొన్నది. రెవెన్యూ విభాగానికి సంబంధించి ఐదు ,పట్టణ ప్రణాళిక ,ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి రెండు వినతులు అధికారులకు అందాయి. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణి వినతులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల వినతులను రికార్డులలో నమోదు చేసి పరిష్కార చర్యలను తిరిగి ప్రజలకు తెలుపాలని స్పష్టం చేశారు. ప్రజావాణి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఉపకమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరు బయోడైవర్సిటీ సానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## డ్యాన్స్‌మాస్టర్ ఆత్మహత్య

మియాపూర్, మే 26: కుటుంబ సమస్యలు, ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మియాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఉత్తర్‌ప్రదేశ్ కైలాసపురికి చెందిన సాగర్ కుమార్ (17) ఇంటర్ చదివాడు. 45 రోజుల క్రిందట నగరానికి వచ్చి మియాపూర్‌లోని గ్లోకుల్ ప్లాట్‌లోని డెలయిట్ డాన్స్ స్టూడియోలో డాన్స్‌మాస్టర్‌గా పనిచేస్తూ స్టూడియోలో ఉంటున్నాడు. 25న రాత్రి 8:30 గంటల సమయంలో స్టూడియో మూసివేసిన తర్వాత యజమాని పరమేశ్ మాస్టర్ సాగర్‌కు ఫోన్ చేసి డోర్లకు లాక్ చేసి భోజనం చేసి పడుకోమని తెలిపాడు. మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో స్టూడియో యజమాని వెళ్లి చూడగా ఓ రూమ్ సీలింగ్ ఫ్యాన్‌కు సాగర్ కుమార్ ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి చూడగా డాన్స్‌మాస్టర్ మృతి చెంది ఉన్నాడు. అతడు స్టూడియోకు వచ్చిన నాటి నుండి ఏదో బాధపడుతూ ఉండేవాడని విషయం అడుగగా కుటుంబ సమస్యలు , ఓ అమ్మాయిని ప్రేమించానని.. విఫలమైందని చెప్పాడు. డాన్స్ స్టూడియో యజమాని ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## టిప్పర్ ఢీకొని ఐటీ ఉద్యోగి మృతి

మియాపూర్, మే 26 : టిప్పర్ ఢీకొట్టడంతో ఐటీ ఉద్యోగి మృతిచెందిన ఘటన మియాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌లో నివాసం ఉండే అలవభోజు కోటేశ్వర్ (27) ఐటీ ఉద్యోగి. ఆదివారం అమీర్‌పేటలోని తన బంధువును కలిసి సోమవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో తన టూ వీలర్‌పై చందానగర్‌కు వెళుతున్నాడు. ఆల్విన్ క్రాస్ రోడ్ వద్ద హఫీజ్‌పేట్ నుంచి మియాపూర్ వైపు టిప్పర్ అతి వేగంగా దూసుకు వచ్చి కోటేశ్వర్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. రహదారిపై పడ్డ అతని తలకు తీవ్రమైన గాయాలై ఘటనా స్థలంలో నే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు పేర్కొన్నారు.

# జలమండలి నిర్లక్ష్యం.. ప్రమాదకరంగా ఎయిర్ వాల్వ్ చాంబర్

జగద్గిరిగుట్ట ,మే 26 : జలమండలి అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితి డీసీపీ కార్యాలయ సమీపం జగద్గిరిగుట్టకు వెళ్లే పైపులైన్ రోడ్డులో కనిపిస్తున్నది. దశాబ్దాల క్రితం జలమండలి వారు పైపులైన్‌తోపాటు పలుచోట్ల ఎయిర్ వాల్ చాంబర్లు నిర్మించారు. వాహన రద్దీ తక్కువగా ఉండడంతో పెద్దగా సమస్య ఏర్పడలేదు. షాపూర్ నుంచి జగద్గిరిగుట్ట మీదుగా హౌసింగ్ బోర్డు ప్రాంతానికి వెళ్లే దగ్గరి దారి కావడంతో పదేండ్లుగా రద్దీ పెరిగింది. పది అడుగుల వెడల్పుతో ఉన్న చాంబర్‌ను వాహనాలు ఢీకొని ప్రమాదాలకు కారణం జరుగుతున్నాయి. ఏడాది క్రితం రెండు చాంబర్లు తొలగించి నేల చదునుగా కాంక్రీట్ నిర్మాణం చేపట్టారు. డీసీపీ కార్యాలయ సమీపం హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో ఉన్నది మాత్రం అలాగే వదిలేశారు. ఇటీవల సమస్య ఉన్న చోటే ఉన్న ఒక చాంబర్‌ను స్లాబు వేసి నేలకు సమంగా మార్చారు.

పాత నిర్మాణం ఉన్న మరో చాంబర్ గదిని మాత్రం వదిలేశారు. దీంతో పదిసార్లు వాహనాలు ఢీకొని గోడలు ధ్వంసం అయ్యాయి. కూడలి ఉన్న ప్రాంతం కావడంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది.ఇక్కడే ఉన్న ఖాళీ స్థలంలో ప్రైవేట్ వాహనాలు నిలుపుతూ ఆక్రమించి దారి లేకుండా చేశారు. ఇకనైనా జలమండలి అధికారులు చాంబర్‌ను సమాంతరంగా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ఇదే ప్రాంతంలో దీపావళి సమయంలో పటాకుల దుకాణాలు, వినాయక చవితిలో తాత్కాలిక కొలనులు ఏర్పాటు చేస్తారు. అప్పుడు పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటున్నదని స్థానికులు, వాహనదారులు అంటున్నారు. హెచ్ఎంటీ మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాల్సి ఉన్నది.



డీసీపీ ఆఫీస్ సమీపంలోని హెచ్ఎంటీ రోడ్డులో ఎయిర్‌వాల్వ్ చాంబర్